క్లుప్తంగా

అలరించిన భక్తి రాగమాలిక



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై డాక్టర్ చింతలపాటి గోపాలకృష్ణ జయంతి సందర్భంగా బెల్లంకొండ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహణలో ×భక్తి రాగమాలిక పదములు× కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చింతలపాటి రమా మహేశ్వరి, ఇమ్మడి అంజనీదేవి, నాగలక్ష్మి, పావని బృందం పలు వాగ్గేయకార కీర్తనల్ని ఆలపించి భక్తుల్ని అలరించారు.

కాటూరి వైద్య కళాశాల విద్యార్థినుల ప్రతిభ



గుంటూరు మెడికల్: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం జూన్‌లో నిర్వహించిన పీజీ కమ్యూనిటీ మెడిసిన్ పరీక్షల్లో కాటూరి వైద్య కళాశాలకు చెందిన కె.దేదీప్య 700 మార్కులకు గాను 513 సాధించి విశ్వవిద్యాలయ చరిత్రలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిగా స్థానం దక్కించుకుంది. వైద్య కళాశాలలో అత్యధిక మార్కులు సాధించిన దేదీప్య, డాక్టర్ సి.విష్ణు ప్రియ, డాక్టర్ శ్రీవల్లిలను బుధవారం చైర్మన్ కాటూరి సుబ్బారావు, డైరెక్టర్ డాక్టర్ స్సైరారావు, డీన్ డాక్టర్ కె.ఎస్.వరప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుబ్బారావు, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ చల్లా మోహన్‌రావు, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ ఫణీంద్ర అభినందించారు.

మణిపూర్ మారణకాండ సభ్య సమాజానికి సిగ్గుచేటు



పాత గుంటూరు: మణిపూర్ మారణకాండ సభ్య సమాజానికి సిగ్గుచేటని ప్రగతిశీల కార్మిక సమాఖ్య నగర కార్యదర్శి ఎస్.పోతురాజు పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనల్ని ఖండిస్తూ ప్రగతిశీల కార్మిక సమాఖ్య నగర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 6న గుంటూరులో భారీ నిరసన ర్యాలీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ కూడలి వద్ద కరపత్రాల ఆవిష్కరించారు. కార్యక్రమంలో డి.శాంతమ్మ, ఎస్. నీలాంబరం, మంచాల జోసెఫ్, నాగేశ్వరరావు, సీహెచ్. రాజశేఖర్, కె. యోహాన్, ఎం.బ్రహ్మయ్య, దానియేలు, రామచంద్రయ్య, ప్రసాద్, వీరయ్య, మహేంద్ర, కిశోర్, గనిరాజు, టి.నరసింహారావు పాల్గొన్నారు.

క్యాలీగ్రఫీ పోటీ పరీక్షలో ప్రథమ స్థానంలో సుస్మితా చౌదరి



గుంటూరు ఎడ్యుకేషన్: అఖిల భారత హ్యాండ్ రైటింగ్–క్యాలీగ్రఫీ అకాడమీ నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్యాలీగ్రఫీ పోటీ పరీక్షలో గుంటూరు అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రొఫెసర్ కె. సుస్మితా చౌదరి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ మేరకు క్యాలీగ్రఫీ నిపుణుడు పి.బి. చంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, బీటెక్ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లకు సైతం క్యాలీగ్రఫీ అకాడమీ ఏటా చేతిరాత పోటీ పరీక్షల్ని నిర్వహిస్తోందని తెలిపారు. గత జూన్ 20న రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన పోటీ పరీక్షకు 4,213 మంది పాల్గొనగా, వారిలో ప్రథమ స్థానంలో నిలిచిన సుస్మితా చౌదరి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేతుల మీదుగా బహుమతి అందుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఏపీఎన్‌జీవో రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలి

ప్రత్తిపాడు: ఏపీ ఎన్‌జీవో 21వ రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని అసోసియేషన్ ప్రత్తిపాడు తాలూకా యూనిట్ ప్రసిడెంట్ సీహెచ్. అనిల్‌కుమార్ కోరారు. ఈ నెల 21, 22 తేదీల్లో విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏపీఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర మహా సభలు జరగనున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అసోసియేషన్ నాయకులు రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఎంపీడీవో ఎ. శ్రీరమ్యతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ మహా సభలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. ఉద్యోగులంతా సభలకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించుకోవడంతో పాటు నేరుగా సీఎం దృష్టికి తీసుకువెళ్లేందుకు మహా సభలు దోహదపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎస్. వెంకటరెడ్డి, ప్రత్తిపాడు తాలూకా సెక్రటరీ మరియేలు, ట్రెజరర్ శేషగిరిబాబు, ఈసీ మెంబరు సీహెచ్ శివనాగు, ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ రామకోటయ్య, ఉమెన్ వింగ్ చైర్ పర్సన్ శ్వేత పాల్గొన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వం పనుల వేగవంతం

ఇంజినీరింగ్ అధికారులకు కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశం



ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: గడప గడపకు మన ప్రభుత్వం (జీజీఎంపీ)పనుల్ని వేగంగా చేపట్టాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో బుధవారం ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో జీజీఎంపీ పనుల్ని నిర్దేశిత గడువు మేరకు పూర్తి చేయాలని, రోజువారి పనుల పురోగతిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. పనులు పూర్తయిన వాటికి బిల్స్ అప్‌లోడ్ చేయాలని, ఎక్కడా జాప్యం జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. నగర పార్కుల్లో పెండింగ్ పనులు పూర్తి చేయాలని చెప్పారు. ఓపెన్ జిమ్, పిల్లల ఆట వస్తువుల మరమ్మతులతో పాటు ఖాళీ స్థలాల్లో ప్లే కోర్టుల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని ఏఈలను ఆదేశించారు. ఏడీహెచ్‌తో ఇంజినీరింగ్ అధికారులు సమన్వయం చేసుకుంటూ పార్కుల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఆమె సూచించారు. ప్రధాన కాల్వల్లో వర్షాలకు ఎక్కడైనా నీరు నిలిచి ప్రజలకు ఇబ్బంది కలిగితే సంబంధిత ఏఈనే బాధ్యత వహించాలని ఆమె తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా నగరంలో ప్రతి పబ్లిక్ టాయ్‌లెట్ మరమ్మతులకు ఆదేశించామని, సదరు పనుల్ని ఈఈలు నేరుగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని కమిషనర్ ఆదేశించారు. రోడ్ల విస్తరణ పనుల్ని పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో చేపట్టాలని చెప్పారు. ఈ– ఆటోలకు జీపీఎస్ ఏర్పాటు చేసి ప్రతి రోజు ట్రిప్స్, లోడింగ్ లిస్టు ఇవ్వాలని, ఎక్కడైనా చార్జింగ్ పాయింట్స్ సమస్య ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. పాఠశాలల్లో చేపట్టిన నాడు – నేడు పనుల పురోగతిపై ఈఈల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం తరగతులు నడుస్తున్నందున విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ప్రధానోపాధ్యాయులతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. 15వ ఫైనాన్స్, ఎన్.క్యాప్ నిధులతో చేపట్టే పనులు నిర్దేశిత గడువు మేరకు జరగడం లేదని, వాటిని ఆయా ప్రాంత డీఈఈలు ప్రత్యేక శ్రద్ధతో వేగవంతం చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఐలాండ్స్ పనులకు టెండర్ పొంది నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లతో ఈఈలు మాట్లాడి పనుల వేగవంతం చేయాలని, స్పందించని వారిపై చర్యలుకు సిఫార్స్ చేయాలని చెప్పారు. తమ పరిధిలో ఎక్కడా తాగునీటి సమస్యలు రాకుండా ఏఈలు పర్యవేక్షణ చేయాలని, సచివాలయాల వారీగా ఎమినిటీ కార్యదర్శులు పైప్‌లైన్ లీకులు, కలుషిత నీటి సరఫరాపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. సమావేశంలో ఈఈలు సుందర్రామిరెడ్డి, కొండారెడ్డి, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, డీఈఈలు, ఏఈలు, టీపీఎస్‌లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషకాహారంతో ఆరోగ్య పరిరక్షణ



కిట్లు అందజేస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: రాష్ట్రంలో పేద మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వైఎస్సార్ సంపూర్ణ పౌష్టికాహార కిట్లను ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు అందజేస్తోందని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు పేర్కొన్నారు. 20వ డివిజన్ సంపత్‌నగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, వారి క్షేమానికి ఎన్నో కార్యక్రమాల్ని చేపడుతోందని చెప్పారు. తల్లులు ఆరోగ్యంగా ఉంటేనే పుట్టబోయే బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం వల్ల తల్లుల్లో రక్తహీనత సమస్య లేకుండా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో అరకొరగా పౌష్టికాహారాన్ని అందించేవారని, దాని వల్ల ఉపయోగం ఉండేది కాదని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, 20వ డివిజన్ అధ్యక్షుడు కంతేటి శ్యాం శేఖర్, కవిత, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

టీజేపీఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారిణిగా జయ శైలజ



జయశైలజను అభినందిస్తున్న ఏఎన్‌యూ ఎన్ఎస్ఎస్ అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ రవిశంకర్ రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ అధికారిణిగా సంస్కృత అధ్యాపకురాలు ఆర్.జయ శైలజను ఏఎన్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగం నియమించినట్లు ప్రిన్సిపాల్ ఏ.బి.పి.మనోహర్ తెలిపారు. పట్టాభిపురంలోని కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో విస్తృత రీతిలో సేవా కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. పచ్చదనం –పరిశుభ్రత, వైద్య శిబిరాలు, చెట్లు పెంచడం, సమాజంలో రుగ్మతలపై వర్క్‌షాప్‌లతో పాటు సీజనల్ వ్యాధులు, ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. స్వాతంత్ర్య సమరయోధుల జయంతి కార్యక్రమాలు, రక్తదాన శిబిరాల్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జయ శైలజను ఏఎన్‌యూ అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ డి.రవిశంకర్ రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ కె.వి. బ్రహ్మం అభినందించారు.

యువతిపై లైంగిక దాడి

పట్నంబజారు: యువతిని బెదిరించి పలు మార్లు లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అరుంధతీనగర్‌కు చెందిన యువతి గత కొన్నేళ్లుగా కాకానిలోని తన మేనత్త వద్ద ఉంటోంది. ఈ క్రమంలో మేనత్త భర్త అమీర్ యువతిని బెదిరించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ దురాగతాన్ని యువతి జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన పాత గుంటూరు పోలీసులకు సమాచారం అందించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

గుంటూరు ఈస్ట్: పాముకాటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి చెందిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంకరగుంట సమీపంలోని గాజువారివీధిలో నివాసం ఉండే నరసింహారావు (61) గత నెల 28న పాముకాటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు అతడ్ని జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగరంగవైభంగా వేంకటేశ్వరుని కల్యాణం



గుంటూరు రూరల్: మనిషి సంతోషంగా ప్రశాంతంగా జీవించాలంటే దేవుని సన్నిధి ఎంతో మేలని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసీ ధర్మచరణ్ తెలిపారు. బుధవారం గోరంట్ల గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గోరంట్ల మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కల్యాణ వేడుకకు ముఖ్య అతిథిగా తులసి ధర్మచరణ్ హాజరయ్యారు. స్వామి ఉత్సవ విగ్రహాలకు, మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద పండితుల వద్ద నుంచి ఆశీర్వచనం స్వీకరించారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మనకు అందుబాటులో ఉన్న దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గోరంట్లలోని దేవాలయాల అభివృద్ధికి యర్రంశెట్టి వేణుగోపాల్ ఎంతో కష్టపడుతున్నారని అభినందించారు. గోరంట్ల మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ స్వామి వారికి నూతన యజ్ఞోపవీతం దండాన్ని తయారు చేయించామని, ఇందుకు సహకరించిన దాతలకు ఆయన ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గొడుగులూరి సుబ్బారావు, తాళ్ల శ్రీనివాస్, తోట రంగారావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మొక్కలను నాటి సంరక్షించాలి



పాఠశాల ప్రాంగణంలో మొక్క నాటిన హెచ్‌ఎం విజయలక్ష్మి, కార్పొరేటర్ చిష్టీ, ఖాసిం

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాలల్లో మొక్కల్ని నాటి వాటిని సంరక్షించే బాధ్యతల్ని విద్యార్థులు చేపట్టాలని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.విజయలక్ష్మి పేర్కొన్నారు. చౌత్రా సెంటర్లోని పాఠశాలలో బుధవారం నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఉర్దూ డీఐ షేక్ ఎండీ. ఖాసిం మాట్లాడుతూ పాఠశాలల ప్రాంగణాల్లో మొక్కలు నాటి, వాటిని సంరక్షించడం ద్వారా కాలుష్యానికి తావులేని, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పెంపొందించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చిష్టీ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

లా ఆఫీసర్స్ నియామకంలో సామాజిక న్యాయం

వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు పోలూరి వెంకటరెడ్డి



మాణిక్యాలరావును సన్మానిస్తున్న పోలూరి

గుంటూరు లీగల్: లా ఆఫీసర్స్ నియామకంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిభ, సామాజిక న్యాయాన్ని ప్రామాణికంగా తీసుకుని అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు పోలూరి వెంకటరెడ్డి తెలిపారు. తెనాలి కోర్టుకు ఎం.మాణిక్యాలరావును ఏజీపీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో బుధవారం వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో స్థానికంగా సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న పోలూరి మాట్లాడుతూ తెనాలికి సంబంధించి ఎస్టీని ఏజీపీగా, ఎస్సీ, బీసీ, ఓసీని ఏపీపీలుగా, తాజాగా ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన మాణిక్యాలరావును ఏజీపీగా నియమించినట్లు తెలిపారు. ప్రతిభ, సామాజిక న్యాయం ఆధారంగా లా ఆఫీసర్స్‌ను నియమిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. సీఎం ఆశయాలకు అనుగుణంగా పేదాల పక్షాన నిలబడి వారికి న్యాయం చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. మాణిక్యాలరావు మాట్లాడుతూ తన ఎంపికకు సహకరించిన వైఎస్సార్ సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తిని శివకుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మాణిక్యాలరావుకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెనాలి కోర్టు ఏపీపీలు మోహన్‌రెడ్డి, సింకా సురేష్, మల్లికార్జున్‌రెడ్డి, ప్రభాకర్, సుబ్బారెడ్డి, గుంటూరు ఏపీపీ సుబ్బారావు, శరత్ పాల్గొన్నారు.

కిట్స్ కళాశాలలో జాతీయస్థాయి వర్క్‌షాప్



విద్యార్థులకు బహుమతుల ప్రదానం

గుంటూరు రూరల్: వర్క్‌షాపులు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయవచ్చని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు గ్రామంలోని కళాశాలలో బుధవారం గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న డిజైన్ థింకింగ్, క్రిటికల్ థింకింగ్ అండ్ ఇన్నో వేషన్స్‌పై జాతీయ స్థాయి వర్క్‌షాపు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కళాశాల చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు వర్క్‌షాపుల్ని సద్వినియోగించుకోవాలన్నారు. శ్రీ చండీ దాస్ చక్రవర్తి ఆపరేషన్స్ అండ్ లాజిస్టిక్స్ సీఈవో ఫౌండర్ అనాను రాయ్‌చౌదరి విద్యార్థులు నూతన ఆవిష్కరణలు ఏ విధంగా చేయాలి, సమాజానికి ఏ విధంగా వాటిని అందించాలో వివరించారు. విద్యార్థుల ఆవిష్కరణలు పరిశీలించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కోయి శేఖర్, ప్రిన్సిపల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, ప్రొఫెసర్ ఆర్.రమేష్ పాల్గొన్నారు.

పురుగు మందుతాగి రైతు ఆత్మహత్య



గుంటూరు రూరల్ (వట్టిచెరుకూరు): అప్పుల బాధతో మనస్తాపానికి గురై, ఇబ్బందులు తాళలేక రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ కోటేశ్వరరావు వివరాల మేరకు..కొర్నెపాడు గ్రామానికి చెందిన ఈగ జనార్దన్, సరస్వతీ దంపతులు గ్రామంలోని వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. జనార్దన్ గత రెండేళ్లుగా సుమారు ఏడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. పత్తి, మిరప పంటలను పండిస్తున్నారు. గతేడాది వ్యవసాయంలో సుమారు రూ.7 లక్షలు నష్టపోవటంతో మనస్తాపానికి గురయ్యారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం గ్రామంలోని పొలంలో పురుగు మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఘటన విషయం తెలిసిన మృతుని భార్య సరస్వతీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

రెండు రోజుల పాటు తాగునీటి సరఫరాలో అంతరాయం

నెహ్రూనగర్: తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్ నుంచి వెంకట కృష్ణాపురం, ఉప్పలపాడు గ్రామాలకు తాగునీటిని సరఫరా చేయడానికి గానూ తక్కెళ్లపాడు జాతీయ రహదారి వద్ద చేపట్టిన ఇంటర్ కనెక్షన్ పనుల నిమిత్తం సంగం జాగర్లమూడి వాటర్ ట్రీట్‌మెంటు ప్లాంటు నిర్వహణ నిలుపుదల చేస్తున్నట్లు కమిషనర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ కనెక్షన్ పనులు వల్ల 4,5 తేదీలో అనగా శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు ఎల్ఎల్ఆర్ (నాజ్ సెంటర్) రిజర్వాయర్ పరిధిలోని అన్ని ప్రాంతాలు, ఎల్బీనగర్ రిజర్వాయర్ పరిధిలోని వినోభా నగర్, మారుతీ నగర్, జాకీర్ హుస్సేన్ నగర్‌లకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆమె పేర్కొన్నారు.

డెలాయిట్‌లో ఉద్యోగాలకు విద్యార్థినుల ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ కౌసల్యాదేవి, రాధామాధవి

గుంటూరు ఎడ్యుకేషన్: బ్రాడీపేటలోని బండ్లమూడి హనుమాయమ్మ (బీహెచ్) మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం డెలాయిట్ సాఫ్ట్‌వేర్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో తొమ్మిది మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కౌసల్యాదేవి తెలిపారు. బీఎస్సీ చివరి సంవత్సరం చదువుతున్న 25 మంది విద్యార్థినులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా, రాత పరీక్ష, మౌఖిక ఇంటర్వ్యూల అనంతరం తొమ్మిది మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు వివరించారు. అరబిందో ఫార్మా కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూల్లో మరో ఆరుగురు బీఎస్సీ చివరి సంవత్సర విద్యార్థినులు ఉద్యోగాల్ని పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినుల్ని కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు డాక్టర్ బి.వి. విజయభాస్కర్, కార్యదర్శి చేగు శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్ రాధామాధవి, అధ్యాపకులు అభినందించారు.

దాడికి పాల్పడిన నలుగురు యువకుల అరెస్టు

- డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి
- సోషల్ మీడియాలో వచ్చిన కథనాల్లో వాస్తవం లేదు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, ఎస్‌హెచ్‌ఓ రామానాయక్

గుంటూరు ఈస్ట్: శారదా కాలనీ 15వ లైనులో కొందరు యువకులు దారి దోపిడీకి పాల్పడ్డారంటూ సోషల్ మీడియాలో వచ్చిన కథనాల్లో వాస్తవం లేదని వెస్ట్ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి వివరణ ఇచ్చారు. అరండల్‌పేట పోలీసుస్టేషన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన అరండల్‌పేట ఎస్‌హెచ్‌ఓ రామానాయక్‌తో కలసి మాట్లాడారు. సోమవారం రాత్రి శారదాకాలనీ 15వ లైనులో సన్ని, క్రాంతి, మణిరెడ్డి, వంశీ రోడ్డుకు అడ్డంగా తమ ద్విచక్ర వాహనాలు పెట్టి మాట్లాడుకుంటున్నారు. అదే సమయంలో శివనాగరాజు, వెంకట్రావు, శరత్‌కుమార్ అక్కడకు వచ్చి ద్విచక్ర వాహనాలు అడ్డం తీయాలని కోరారు. ఈ నేపథ్యంలో వారి మధ్య గొడవ జరిగింది. సన్ని, క్రాంతి, మణిరెడ్డి, వంశీ వీరిని తీవ్రంగా కొట్టి గాయపరిచారు. అనంతరం వారు శివనాగరాజు కాలనీలోని క్రాంతి ఇంటికి వెళ్లారు. పాత పరిచయం నేపథ్యంలో రమణ అనే మహిళ అక్కడకు రావడంతో నలుగురు యువకులు ఆమెతో గొడవ పడ్డారు. రమణపై దాడి చేసి ఆమె స్కూటీని ధ్వంసం చేశారు. ఈ రెండు ఘటనలపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. బుధవారం సన్ని, క్రాంతి, మణిరెడ్డి, వంశీని అరెస్టు చేసినట్లు తెలిపారు. వాహనాలు అడ్డు పెట్టిన విషయంలో గొడవ జరిగింది తప్పా, దారిదోపిడీ కాదని తెలిపారు.

జిల్లాస్థాయి ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న శివాజీ, విష్ణువర్థన్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాస్థాయి ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్లు కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 9వ జిల్లాస్థాయి ఫెన్సింగ్ చాంపియన్‌షిప్-2023లో 5వ తరగతి విద్యార్థి ముట్లూరి ప్రదీపాల్, 7వ తరగతి విద్యార్థి ముట్లూరి సింజోన్ అండర్-8, అండర్-12 విభాగాల్లో పాల్గొని బంగారు, రజత పతకాలను సాధించినట్లు వివరించారు. క్రీడలతో విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదుగుతారన్నారు. విద్యార్థుల్ని ఆటలు, క్రీడల్లో ప్రోత్సహించాలని ఆయన తల్లిదండ్రులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్ని పాఠశాల గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ, పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ఉపాధ్యాయులు అభినందించారు.

జీజీహెచ్‌లో రాత్రిళ్లు అందుబాటులో మహాప్రస్థానం వాహనాలు



ఆయుష్ డాక్టర్‌తో మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన వారి భౌతికకాయాల్ని ఇతర జిల్లాలకు సైతం రాత్రి సమయంలో కూడా ఉచితంగా తరలించేలా ఏర్పాట్లు చేశామని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. ప్రైవేటు అంబులెన్సుల ఆగడాల్ని కట్టడి చేసేందుకు బుధవారం రాత్రి రెండు వాహనాల్ని రాత్రి సమయంలో అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఉచితంగా అందిస్తున్న మహాప్రస్తానం సేవల్ని మరింత పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రతిరోజూ సుమారు 15 మృతదేహాల్ని మహాప్రస్థానం ద్వారా ఇళ్లకు ఉచితంగా తరలిస్తున్నట్లు వెల్లడించారు.

ఆయుష్ వైద్య విభాగం తనిఖీ

జీజీహెచ్ ఆవరణలోని ఆయుష్ వైద్య విభాగాన్ని బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తనిఖీ చేశారు. వైద్య విభాగంలో అపరిశుభ్రమైన వాతావరణం ఉందని, తక్షణమే క్లీనిక్ చేయించుకోవాలని ఆదేశించారు ప్రకృతి వైద్యం, యూనాని వైద్య సేవల్ని కూడా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. తనిఖీల్లో సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని పాల్గొన్నారు.

ఎన్జీరంగా వర్సిటీలో బళ్లారి రాఘవ జయంతి



బళ్లారి రాఘవ చిత్రపటానికి నివాళి

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో బళ్లారి రాఘవ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. బుధవారం నగర శివారులోని లాం ఫాం నందు నిర్వహించిన కార్యక్రమంలో విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకురాలు డాక్టర్ ఎల్.ప్రశాంతి రాఘవ చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రముఖ న్యాయవాదిగా రాఘవ చేసిన సేవలను కొనియాడారు. నాటక రంగంపై మక్కువతో రంగస్థలంపై నటిస్తూ వివిధ బాషల్లో పలు దేశాల్లో మన సంస్కృతిని చాటిచెప్పారన్నారు. నాటక రంగంలో స్త్రీలను ప్రోత్సహించారన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎ.సుబ్బరామిరెడ్డి, డీన్ డాక్టర్ పి.సాంబశివరావు, కంప్ట్రోలర్ డాక్టర్ ఏవీ రమణ, ఎస్టేట్ ఆఫీసర్ పి.రవి తదితరులు పాల్గొన్నారు.